
# ఓ తల్లి నిర్ణయం

కథ

ఆదుర్తి బాల

**కామేశ్వరి భర్త వసంతరావు హార్ట్ అటాక్ వచ్చి హఠాత్తుగా చనిపోయాడు. అది కామేశ్వరి జీవితంలో ఊహించని పరిణామం. కబురు అందుకున్న ఆమె కొడుకులిద్దరూ దేశరాజధాని నుండి ఒకరూ, రాష్ట్ర రాజధాని నుండి ఇంకొకరూ హుటాహుటిన బయల్దేరి వచ్చారు. ఆమె ఒక్కగానొక్క కూతురుండేది పక్క ఊరే కాబట్టి తండ్రి పోయిన రెండు గంటల్లోనే వచ్చేసింది.**



కామేశ్వరి కొడుకులిద్దరూ తండ్రి అంత్యక్రియలూ, దశదిన కర్మలూ దగ్గరుండి శ్రద్ధగా జరిపించారు. తండ్రి ఆత్మశాంతి కోసం ఊరందరినీ పిలిచి భోజనాలు పెట్టించారు. బంధుమిత్రులతో, పరామర్శించడానికి వచ్చిపోయే వాళ్లతో మడి, మైలబట్టలతో ఇల్లంతా అస్తవ్యస్తంగా ఉంది. ఇంటి ముందర రంగవల్లులతో పసుపు కుంకాలతో కామేశ్వరమ్మ తీర్చిదిద్దుకున్న బొమ్మరిల్లు లాంటి ఇల్లు కళాకాంతులు కోల్పోయిన కామేశ్వరి మొఖం లాగే బోసిపోయింది.

భర్త పోయిన క్షణం నుండి కామేశ్వరి కంట తడి ఆరట్లేదు. ఎవరెంతగా ఓదార్చినా ఆమెకి ఊరట కలగట్లేదు. ఊరడిల్లడానికీ, మర్చిపోయి మామూలుగా ఉండడానికీ భర్తతో ఆమె అనుబంధం ఒకనాటిది కాదు! నలభై ఏళ్లుగా భర్త సాహచర్యంలో భర్తతోడిదే జీవితం అనుకున్న ఆత్మీయానుబంధం అది!

పెళ్లి గురించి, స్త్రీ పురుషుల మధ్య ఉండే సంబంధం గురించీ ఏమాత్రం జ్ఞానం లేని వయసులో ఆమెకి వసంతరావుతో పెళ్లి అయింది. తన పదమూడో ఏట భర్త చేయి పట్టుకొని మెట్టినింట అడుగు పెట్టింది కామేశ్వరి. ధర్మేచ, అర్థేచ... నాతి చరామి అని వేదమంత్రాల సాక్షిగా ఆమె చేయి అందుకున్న వసంతరావు పెళ్లి నాటి ప్రమాణాన్ని నిలబెట్టుకున్నట్టుగా జీవితపు చివరి శ్వాస వరకూ ఆమెకి ఏ కష్టం కలుగకుండా అపురూపంగా చూసుకున్నాడు. వసంతరావు ఆమెకి భర్తగానే కాదు ఓ మంచి మిత్రుడు, గురువూ కూడా. పెళ్లి నాటికి ఐదో క్లాసు మాత్రమే చదువుకున్న కామేశ్వరిని మెట్రిక్ పరీక్షకి కట్టించాడు. అందుకు కావాల్సిన పుస్తకాలు కొని తనే పాఠాలు చెప్పేవాడు. అలా ప్రాణాధికంగా ప్రేమించిన భర్త గుండెపోటు వచ్చి అర్థాంతరంగా పోతే తట్టుకోడానికి ఆమెకి శక్తి చాలట్లేదు. ఎవరి బాధలతోటి, కన్నీళ్లతోటీ సంబంధం లేని కాలం గడచిపోతోంది ఎప్పటిలాగే.

వచ్చిన బంధుజనాలందరూ వెళ్లిపోయారు. కామేశ్వరి, ఆమె ఇద్దరు కొడుకులూ, కూతురూ కుటుంబాలు మాత్రం మిగిలిపోయారు.

"ఈ ఇంటినీ, పొలాన్నీ అమ్మ ఒక్కత్తే చూసుకోలేదు. మనకా చీటికీ మాటికీ ఇక్కడికి రావడం కుదరదు. అందుకని ఇల్లూ, పొలమూ, అమ్మకానికి పెట్టేద్దాం" అన్నాడు పెద్దకొడుకు సురేష్.

"నువ్వు చెప్పింది కరెక్టే అన్నయ్యా.. అదేదో ఇప్పుడే చేద్దాం. ఉద్యోగాలకి శలవు పెట్టి అంత దూరం నుంచి మళ్లీ మళ్లీ రావడమంటే కష్టం" అన్నాడు చిన్నకొడుకు వాసు.

"నాకూ సమానహక్కుందిరోయ్ వచ్చిందాంట్లో నాకూ వాటా వెయ్యడం మర్చిపోకురా అన్నయ్యా" అంది కామేశ్వరి కూతురు సరోజ.

"అలాగేలేవే ముందర బేరం కుదిరి చేతికి డబ్బు రానీ" అన్నాడు సురేష్.

"అమ్మకి కూడా వాటా వెయ్యాలంటావా" సందేహంగా అన్నాడు వాసు.

సురేష్ ఏదో చెప్పే లోపలే అతని భార్య నీరజ అందుకుంది. "తిండికీ, బట్టకీ తప్పితే ఈ వయసులో ఆవిడకి ఖర్చులేముంటాయి. అదేదో ఆవిడ ఎవరి దగ్గరుంటే వాళ్లు చూసుకుంటారు. ఇంక అత్తయ్యకి కూడా వాటా ఇవ్వాల్సిన అవసరమేముంది"

నీరజ అభిప్రాయంతో అందరూ ఏకీభవించారు. ఇంటికీ, పొలానికి బేరం పెట్టి అమ్మే వరకూ అందరూ అక్కడే ఉండాలని నిర్ణయించుకున్నారు. తన కళ్ల ఎదురుగా జరిగే తంతుని నిర్వేదంగా, నిర్లిప్తంగా చూస్తోంది కామేశ్వరి. పదిహేను రోజుల్లోనే అన్నీ కుదిరి ఇల్లూ పొలమూ అమ్మిన డబ్బు ముగ్గురు పిల్లలూ వాటాలేసుకుని తీసుకున్నారు.

"అమ్మని నాతో తీసుకెడతాను" అన్నాడు పెద్దకొడుకు సురేష్.

"అక్కడ అత్తయ్యకేం తోస్తుందండీ మీరిద్దరూ ఆఫీ



సుకెడితే ఆవిడకి మళ్లీ వంటరితనమేగా. అత్తయ్యని మాతో తీసుకెడతాం. నేనూ ఇంట్లోనే ఉంటాను కాబట్టి ఆవిడకి కూడా కాస్త కాలక్షేపంగా ఉంటుంది" అంది చిన్నకోడలు సుందరి. సుందరి పని విషయంలో ఎంత బద్ధకస్తురాలో నీరజకి తెలుసు. అత్తయ్యని తనతో తీసుకెళ్లి వంటా వార్పు ఆవిడచేత చేయించుకొని సుఖపడి పోదామనుకుంటోంది. ఎంత తెలివో. మనసులోనే పళ్లు నూరుకుని పైకి మాత్రం ముఖానికి నవ్వు పులుముకుని అంది నీరజ. "నువ్వు చెప్పింది బాగానే ఉంది గానీ తండ్రి పోయిన తరువాత తల్లి పెద్ద కొడుకు దగ్గరుండడమే భావ్యం. ఎంత చదువుకున్నా, ఉద్యోగాలు చేసినా మనమూ కొన్ని సంప్రదాయాలు పాటించాలిగా"

నీరజ ఆంతర్యం అర్థమైంది సుందరికి. 'ఏం తల్లీ నువ్వూ, బావగారూ ఉద్యోగాలకి పోతే అత్తయ్యని ఫ్రీగా దొరికే నమ్మకమైన మనిషిలా ఇంట్లో ఉంచుకుందామనీ నీ ప్లాను. నేను పసికట్టలేననుకున్నావా?' అనుకుంది. పైకి మాత్రం "పోనీలే అక్కా సంప్రదాయం ప్రకారం అత్తయ్యని మొదట మీరు తీసుకెళ్లి కొన్నాళ్లుంచుకొని తరువాత మా ఇంటికి పంపించండి" అంది సుందరి చేసేదేం లేక.

కామేశ్వరికి సంబంధించిన నిర్ణయాలన్నీ ఆమె ప్రమేయం లేకుండానే జరిగిపోతున్నాయి. పెద్దకొడుకు సురేష్‌తో ఢిల్లీ వెళ్లడానికి ఏర్పాటు జరిగిపోయింది. ఢిల్లీలో సురేష్ వాళ్లుండేది చిన్న అపార్ట్‌మెంట్. పల్లెటూరిలో విశాలమైన ఇంట్లో, పెరట్లో పచ్చని మొక్కల మధ్య వనదేవతలా బతికిన కామేశ్వరమ్మకి ఆ ఇరుకు గదుల్లో అడ్జస్టవ్వడం కష్టంగానే ఉన్నా క్రమంగా అలా బతకడం అలవాటు చేసుకుంది. మొదటి రెండు నెలలూ అత్తగారిని బాగానే చూసుకుంది నీరజ. అత్తగారిని వంటపని, ఇంటిపనీ చేయనిచ్చేది కాదు. అలాంటిది ఓ రోజు కామేశ్వరి వంట గదిలోకి రాగానే పొద్దుటే అంట్ల గిన్నెలు కడుగుతూ కనిపించింది నీరజ. "ఏమ్మా పనమ్మాయి రాలేదా" అడిగింది కామేశ్వరి.

"నేనే వద్దన్నానత్తయ్యా . జీతం పెంచమని ఒకటే గొడవ. పని కూడా ఇదివరకటిలా శుభ్రంగా చేయట్లేదు. అందుకని మాన్పించేశాను. ఓ అరగంట ముందరే లేచి అన్ని పనులూ నేనే చేసుకుందామనుకుంటున్నాను" అంది నీరజ, కామేశ్వరి వంక ఓరకంట చూస్తూ.

"పనివాళ్లు అంతేనమ్మా. ఎంతైనా మనం చేసినట్టు శ్రద్ధగా పనిచేస్తారా ఏమిటి? ఆ గిన్నెలు నే కడుగుతాలే నువ్వు లే" అంది కామేశ్వరి.

"అయ్యో మీకు శ్రమెందుకు నే చేస్తాలెండి" అంది నీరజ మొహమాటం నటిస్తూ.

"ఫర్వాలేదులేమ్మా ఖాళీగా కూర్చుని ఏం చేస్తాను. పని చేయడం నాకేం కొత్త కాదుగా అంటూ పనిలో చొరబడింది కామేశ్వరి. తను ఆశించినట్టే జరగడంతో తృప్తిగా ఊపిరి పీల్చుకొని స్నానం చేసి ఆఫీసుకి రెడీ అవ్వాలనే వంకతో బాత్రూంలోకి వెళ్లింది నీరజ. అది మొదలు ఇంటిపని వంటపనీ క్రమక్రమంగా కామేశ్వరి డ్యూటీ అయిపోయింది. అయినా బాధపడలేదు కామేశ్వరి. తను చేసే పని తన వారికోసమేగా అని సరిపెట్టుకుంది. నాలుగు నెలలు గడిచాయి. చిన్నకొడుకు వాసు హఠాత్తుగా ఊడిపడ్డాడు.

"అమ్మా నా దగ్గర కొన్నాళ్లుందువుగానివి. నువ్వెలా ఉన్నావో అని బెంగగా ఉంది నాకూ నీ కోడలుకీ" అన్నాడు వాసు. కొడుకుకి తనమీదున్న అభిమానానికి కామేశ్వరి మనసు నిండిపోయింది. కొడుకుతో ప్రయాణమయింది. "మీరు వెళ్లిపోతుంటే దిగులుగా ఉందత్తయ్యా" అంది నీరజ. ఆ దిగులు తను వెళ్లిపోతున్నందుకు కాదనీ ఇంతకాలం వదలిన పనిభారం మళ్లీ మీద పడుతున్నందుకనీ కామేశ్వరికి తెలీదు. "త్వరగా వచ్చేస్తాలేవే పిచ్చిపిల్లా - ఇప్పుడు వెళ్లకపోతే వాడు మనసు కష్టపెట్టుకుంటాడు" అంది కామేశ్వరి కోడల్ని దగ్గరకు తీసుకొని.

వచ్చిన మర్నాడే తన ఇద్దరి పిల్లల పనులూ అత్తగారికి అప్పజెప్పేసింది సుందరి. మనవలకి స్నానం చేయిం

## పేరు కోసం...

నటించే సినిమాలకన్నా ఇతరత్రా విషయాల ద్వారానే తనుశ్రీ దత్తాకి పాపులారిటీ వస్తోందని చెప్పవచ్చు. ఈమధ్య కొంతకాలంగా ఎలాంటి పబ్లిసిటీ లేకపోవడం వల్లనో ఏమో కొత్తగా తను అమితాబ్ వీరాభిమానినంటూ మొదలెట్టింది. బిగ్ బిని తెగ పొగడ్డంతో వార్తలకెక్కవచ్చని భావించిందేమో అమితాబ్‌ని తన అభిమాన నటుడు అంటూ భజన ప్రారంభించింది. ఏదో ఓ రకంగా నాలుగు పత్రికల్లో చానళ్లలో తన పేరు కనిపించేలా ట్రయ్ చేస్తుంది అంటున్నారు సినీజనాలు.

చదం, స్కూలుకి తయారు చేయటం, వాళ్లకి అన్నాలు పెట్టటం కామేశ్వరి వంతు అయింది. వాసుకి ఇద్దరూ మగపిల్లలే. ఇద్దరూ గడుగ్గాయిలే. ఇద్దరికీ ఒక్క క్షణం కూడా పడేది కాదు. అస్తమానూ కొట్టుకుంటూ ఇల్లంతా పరుగులు పెట్టేవారు. చేతికందిన వస్తువులు విసిరేసే వాళ్లు. ఎప్పుడు ఎక్కడ దెబ్బ తగిలించుకుంటారోనని కామేశ్వరికి చాలా టెన్షన్‌గా ఉండేది. ఆవిడ ఎంత జాగ్రత్తగా చూసినా ఒక రోజు పెద్ద మనవడికి గట్టి దెబ్బే తగిలింది. "వాళ్లలా కొట్టుకుని దెబ్బలు తగిలించుకుంటుంటే పెద్దదానివి నువ్వేం చేస్తున్నావమ్మా" అన్నాడు వాసు. కామేశ్వరి మనసు కలుక్కుమంది. ఇంటినీ, పిల్లల్నీ చూసుకోవాల్సిన భార్యని అడగాల్సిన మాట అది. కోడలికెప్పుడూ ఇల్లు పట్టదు. పొద్దున్నేపుడో స్నానం చేయకుండానే ఇంత ఉడకేస్తుంది. పిల్లల్ని తనకప్పగించి ఏ టీవీనో చూస్తుంది. లేకపోతే షాపింగ్‌కనో, ఫ్రెండింటికనో వెళ్లిపోతుంది. అటువంటి భార్యని మందలించాల్సింది తననే తప్పు పడుతున్నాడు కొడుకు. ఆయన బతికుంటే ఇలా ఉండేదా తన జీవితం. ఆస్తి అమ్ముకుని తన చేతిలో చిల్లి గవ్వ కూడా పెట్టలేదు. బొత్తిగా పరాధీనమైపోయింది బ్రతుకు అనుకున్న కామేశ్వరికి ఇపుడిపుడే ప్రపంచం అర్థమవుతున్నట్టనిపించింది.

ఆ రోజు కామేశ్వరికి కూతుర్నించి ఫోనొచ్చింది. "అన్నయ్యల దగ్గర ఇన్ని నెలలు ఉన్నావుగా నా దగ్గరికెప్పుడొస్తావు" అంది ఫోనులోనే. "కొడుకులే కానీ కూతురు గుర్తుకు రావట్లేదా - ఇక్కడ పిల్లలతో ఎంత అవస్థ పడుతున్నానో నువ్వొచ్చి కొన్నాళ్లుంటే నాకూ వెసులుబాటుగా ఉంటుందిగా" అంది. ఈ పిల్లలు తన మీద ప్రేమతో పిలుస్తున్నారా లేక అవసరం కోసం పిలుస్తున్నారా అనుకుంది కామేశ్వరి మొదటిసారిగా. పూర్వ కాలంలో జీవితం మలి సంధ్యలో వాన ప్రస్థాశ్రమానికి వెళ్లి శేషజీవితాన్ని గడిపేవారట. భగవచ్చింతలో అంతిమ ఘడియ వరకూ గడిపే వారట. ఈ కాలం తల్లులకి ఆధ్యాత్మిక చింతనలో గడపడానికి అవకాశమేదీ. కూతుళ్లో కొడుకులో ఉద్యోగాలకి పోతే మనవల బాధ్యత కూడా ముసలి తల్లిదండ్రుల మీదే పడుతోంది. వయసు పైబడ్డా సంసార బంధనాలు వదలట్లేదు అనుకుంటూ బరువుగా నిట్టూర్చింది కామేశ్వరి.

చిన్నకొడుకింట్లో ఓ నాలుగు నెలలు గడిపాక కూతురింటికి ప్రయాణమైంది కామేశ్వరి. కూతురింట్లో కూడా కామేశ్వరి పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. "అమ్మా నువ్వు మొన్న చేసిన గుత్తొంకాయ కూర ఆయనకెంత నచ్చిందో తెలుసా. నువు పెట్టిన ముక్కల పులుసుకున్న టేస్టు అద్భుతం అన్నారాయన. నీ చేతి వంట తిన్న తరువాత నేనేం చేసినా నచ్చట్లేదాయనకి" అనేది కూతురు. ఈ వయసులో తల్లికి విశ్రాంతినివ్వాలనే ఆలోచన తన పిల్లలెవరికీ లేదు. పోనీలే భగవంతుడీ మాత్రం ఓపిక ఇచ్చినందుకు ఆ మాత్రం శ్రమపడదంలో తప్పు లేదులే అని అనుకునేది కామేశ్వరి. ఒక రోజు కామేశ్వరి నీళ్ల బిందె తెస్తూ కాలు జారి పడిపోయింది. తుంటి ఎముక విరిగింది. ఆపరేషన్ చేయాలన్నాడు డాక్టరు. అన్నయ్యలకి కబురు పెట్టింది సరోజ. సురేష్, వాసు మాత్రమే వచ్చారు. ఆపరేషన్ సక్సెస్ అయింది కానీ ఆవిడకి విశ్రాంతి కావాలన్నాడు డాక్టరు. బరువులెత్తే పనులేవీ చేయకూడదన్నాడు.

"అమ్మని కొన్నాళ్లు జాగ్రత్తగా చూసుకో" అన్నాడు సురేష్ చెల్లెలితో.

"పిల్లల పని, ఇంటి పనితో అమ్మ పని కూడా చేయడం నా వల్ల కాదురా" నిక్కచ్చిగా చెప్పేసింది సరోజ.

"నేనూ, మీ వదినా ఉద్యోగాలకి పోతాం. అమ్మ కోసం ఉద్యోగాలు మానుకోలేం కదా. కావాలంటే నెలకో వెయ్యో రెండువేలో పంపిస్తాను. అమ్మని నీ దగ్గిరుంచుకో" తమ్ముడు వాసుతో అన్నాడు సురేష్.

"మా ఇంట్లో అసలు కుదరదురా సుందరి ఒక్కర్తీ అంత పనీ చేయలేదు" అనేశాడు వాసు. ఇంకో మాట మాట్లాడడానికి అవకాశం ఇవ్వకండి. తనకి చాకిరీ చేయాల్సిన బాధ్యతని తప్పించుకోడానికి పిల్లలు వెతుకుతున్న కారణాలని వింటూ విస్తుబోయింది కామేశ్వరి. చేతిలో డబ్బు లేక పనిచేసే ఓపిక లేక పూర్తిగా పరాధీనమైన తన భవిష్యత్తుని తల్చుకొని భయపడిపోయింది కామేశ్వరి.

"అమ్మా బాగున్నారా" చిరపరిచితమైన కంఠం వినపడగానే తన ఆలోచనలలోంచి బైటపడి ఎదురుగా ఉన్న మనిషిని చూసింది కామేశ్వరి.

"నేనమ్మా సుబ్బారావుని గుర్తుపట్టలేదా తల్లీ" ఆప్యాయంగా అన్నాడు సుబ్బారావు.

"మీరా అన్నయ్యగారూ ఏదో పరధ్యానంలో ఉన్నాను ఏమీ అనుకోకండి" అంది కామేశ్వరి.

సుబ్బారావు, వసంతరావు ప్రాణ స్నేహితులు. వసంతరావు బతికి ఉన్న రోజుల్లో సుబ్బారావు తరచూ వీళ్లింటికి వస్తూండేవాడు. కామేశ్వరి కూడా ఆయనని సొంత అన్నయ్యలాగే అభిమానించేది.

"ఆయనకి ఎంత స్వార్థమో చూశారా అన్నయ్యగారూ. నన్నిలా ఒంటరి దాన్ని చేసి తనదారి తాను చూసుకున్నారు" బాధతో గొంతు పూడుకుపోతుండగా అంది కామేశ్వరి.

"నీ భర్త స్వార్థపరుడు కాదమ్మా. తను పోయిన తరువాత నువ్వెలా బతుకుతావో అని ఆలోచించాడు కాబట్టే నీ శేషజీవితాన్ని హాయిగా గడపడానికి ఏర్పాటు చేసే వెళ్లాడు" అన్నాడు సుబ్బారావు.

అర్థం కానట్టు చూసింది కామేశ్వరి. సుబ్బారావు చెప్పడం మొదలుపెట్టాడు.

"నూరేళ్లూ కలిసి జీవించాలనే ఆశతోనే ఏడడుగులతో వివాహ జీవితం ప్రారంభిస్తారు భార్యాభర్తలు. కానీ ఒప్పుకోవడానికి బాధగా ఉన్నా మన జీవిత కాలపరిమితి పరిమితం అంది. నిజం. ఒకరికొకరు అనుకున్న భార్యాభర్తలలో ఎవరు ముందు పోయినా మిగిలిన వారికి ఒంటరితనం తప్పదు కదమ్మా - ఒకవేళ ఆ ఒంటరితనమే నీకు మిగిలితే లోకజ్ఞానం లేని నువ్వెలా నెగ్గుకొస్తావో అని బెంగపడేవాడు వసంతరావు. అందుకే నీ పేరు మీద కొంత డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాడు. ఆ సంగతి నీ పిల్లలకి తెలియనివ్వద్దన్నాడు. నీకు కూడా చెప్పలేదు. ఎందుకంటే తెలిక పిల్లల దగ్గిర నోరు జారతావేమోనని. ఆ డబ్బు ఈమధ్యే మెచ్యూర్ అయింది. లక్ష రూపాయలు వస్తుందిపుడు నీకు. ఇపుడా డబ్బు నీ ఇష్టం వచ్చినట్టు చేసుకునే హక్కుంది నీకు. చెప్పమ్మా ఆ డబ్బుతో ఏం చేద్దామనుకుంటున్నావు" భర్తకి తన మీద గల ప్రేమకి దుఃఖం వచ్చింది కామేశ్వరికి. ఉప్పెనలా వచ్చే దుఃఖాన్ని దిగమింగుకొని మనసుని స్వాంతనపరుచుకుంది.

"ఒక్క సాయం చేయగలరా అన్నయ్యగారూ" అంది కామేశ్వరి.

"చెప్పమ్మా" అన్నాడు సుబ్బారావు.

"నా శేషజీవితాన్ని ప్రశాంతంగా గడపాలనుకుంటున్నాను. ఆ డబ్బుతో మీకు తెలిసిన మంచి వృద్ధాశ్రమంలో చేర్పండి" అంది కామేశ్వరి స్థిరంగా.

"మీ పిల్లలు బాధపడతారేమో ఒకసారి ఆలోచించండి" అన్నాడు సుబ్బారావు. అంత బాధలోనూ ఫక్కున నవ్వింది కామేశ్వరి. "వీళ్లందరూ నా వాళ్లే కానీ నేను నేనుగా కావాలనుకున్నవాళ్లు కాదు. నాకొచ్చే డబ్బు ఎరచూపితే వీళ్లు నన్ను ఆదరిస్తారు కానీ డబ్బుతో పొందే ప్రేమలో సహజత్వం ఉండదు. మనిషికి గాలి, నీరు ఎంత అవసరమో ప్రేమ కూడా అంతే అవసరం. గాలిని, నీటినీ కృత్రిమంగా సృష్టించలేనట్టే ప్రేమని కూడా పుట్టించలేం" విరక్తిగా అంది కామేశ్వరి. ఒక జీవిత సత్యం తెలుసుకోడానికి ఒకొక్కసారి ఓ జీవిత కాలం పడుతుందేమో.

★

